ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
3-4-2013 బుధవారం



66 ను పెంచాలన్నదే మా ధ్యేయం

హైదరాబాద్‌లో మరో కార్పొరేట్ హాస్పిటల్ త్వరలో ప్రారంభం కానుంది. ఉస్మానియాలో చదివి అమెరికా వెళ్లి 30 ఏళ్ల అనుభవంతో తిరిగొచ్చిన డాక్టర్ గురు ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో నానక్‌రాంగూడలో రూపుదిద్దుకున్న 'కాంటినెంటల్ హాస్పిటల్స్'కు బోలెడన్ని ప్రత్యేకతలున్నాయి. 18 అంతస్తులు, 700 పడకలుండే ఈ ఆస్పత్రిలో ఏ రోగీ ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా చేస్తామని ఆయన హామీ ఇస్తున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

''ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ పూర్తి చేసి పై చదువుల కోసం 1983లో అమెరికా వెళ్లాను. ముప్పయ్యేళ్ల పాటు అక్కడే పనిచేశాను. అయితే 25 యేళ్లు పూర్తయిన దగ్గరనుంచీ నా మనసు నన్ను అక్కడ స్థిరంగా ఉండనివ్వలేదు. కొత్తగా, చాలెంజింగ్‌గా ఏదైనా చేయమని చెప్పడం మొదలుపెట్టింది. అదే నన్ను మన దేశంలో మంచి ఆరోగ్య సేవలు అందించాలనే దిశగా నడిపించింది. 2006 నుంచి 2007 వరకు ఏడాది పాటు మన దేశంలోని ఆసుపత్రులన్నిటికీ వెళ్లి చూశాను. అక్కడి పరిస్థితులను గమనించాను. మేనేజ్‌మెంట్లతో మాట్లాడాను. ముఖ్యంగా వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి అని అడిగి తెలుసుకున్నాను. ఒక రకంగా ఇది నా స్పిర్చ్యువల్ జర్నీ (ఆధ్యాత్మిక ప్రయాణం) అన్నమాట.

తెలుసుకుంది ఏమిటంటే...

ఆరోగ్య సేవలు అందాల్సింది కోట్ల మందికి అయితే అందుకు తగ్గట్టుగా ఆసుపత్రులు కాని, వైద్య పరికరాలు కాని, ఇతర సౌకర్యాలు కాని మన దగ్గర లేవు. దాంతో డాక్టర్ల దగ్గర చూపించుకునేందుకు గంటలపాటు ఎదురుచూడాల్సి వస్తోంది. మన దేశంలో డాక్టర్ పేషెంట్ నిష్పత్తి చూస్తే ఆశ్చర్యమేస్తుంది. 1950 మంది పేషెంట్లకు ఒకరే డాక్టర్ ఉన్నారు. అదే అమెరికాలో అయితే 800 మంది పేషెంట్లకు ఒక డాక్టరు ఉన్నారు. అంటే మన మీద వాళ్లు చాలా మెరుగ్గా ఉన్నట్టే కదా. ఈ పరిస్థితి మన గ్రామాల్లో ఇంకా ఘోరంగా ఉంది. ఇవన్నీ గమనించిన తరువాత అంతర్జాతీయ స్థాయిలో పేషెంట్లకు సర్వీసు అందించాలనే పట్టుదల పెరిగింది. అలా ఏర్పడిందే 'కాంటినెంటల్ హాస్పిటల్స్'. దీన్ని మన వాళ్లతో పాటు ఎన్ఆర్ఐలను కూడా దృష్టిలో పెట్టుకుని 18 అంతస్తుల భవనంలో ఏర్పాటుచేశాం. ఇది మన దేశంలోనే మొట్టమొదటి లీడ్ (లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ డిజైన్) గ్రీన్ బిల్డింగ్ ఆసుపత్రి కావడం విశేషం. అంటే కాలుష్యానికి దూరంగా పేషెంట్లకు మంచి వాతావరణాన్ని కల్పించే భవంతి అన్నమాట.

మిగతా వాటికి భిన్నంగా...

వైద్య సదుపాయాల విషయానికి వస్తే సాంకేతికంగా అంతర్జాతీయస్థాయిలో ఉన్న పరికరాలను వాడుతున్నాం. రోగి సమాచారం కంప్యూటర్‌లో నిక్షిప్తమై ఉంటుంది. ఉదాహరణకి డయాబెటిక్ పేషెంట్‌లని తీసుకుంటే వీళ్లకి శరీరంలోని అన్ని అవయవాలపై షుగర్ తాలూకు ప్రభావం ఉంటుంది. ఒక్కో స్పెషలిస్టు వద్దకు వెళ్లినప్పుడు మొదట్నించీ అంతా చెప్పుకుంటూ రాకుండా పేషెంటు ఐడిని చెప్తే సరిపోతుంది. డాక్టర్లు ఆ ఐడిని కంప్యూటర్‌లో ఎంటర్ చేసి వివరాలు చూసుకుంటారు. దీనివల్ల ఇద్దరికీ సమయం ఆదా అవుతుంది. పేషెంటుతో డాక్టరు ఎక్కువ సమయం గడిపే అవకాశం ఉంటుంది. అత్యవసర సేవల కోసం అంటే... యాక్సిడెంట్, స్ట్రోక్, హార్ట్ ఎటాక్ వంటి వాటికోసం 27 పడకలతో 24 గంటల సర్వీసులు ఉన్నాయి. ఐసియు, ఎమర్జెన్సీల వద్ద పేషెంట్ అటెండెంట్‌లు, విజిటర్ల కోసం ప్రత్యేకంగా గదులు కూడా ఏర్పాటుచేశాం. పేషెంట్లకి 700 పడకలు ఏర్పాటుచేస్తాం. వీటిలో వంద పడకలను ఆరోగ్యశ్రీ పేషెంట్ల కోసం కేటాయించాం. ఈ పడకలు కూడా మిగతా వాళ్లకి మల్లే అన్ని సౌకర్యాలతో ఉంటాయి. వివక్ష లేదు. ఇక అవుట్ పేషెంట్ విషయానికి వస్తే గంటలు గంటలు వేచి చూడాల్సిన అవసరం ఉండదు. అవుట్‌పేషేంట్ల కోసం ప్రత్యేకంగా ఆరుగురు ఫిజిషియన్ అసిస్టెంట్లు ఉంటారు. మొదట వాళ్లు రోగుల్ని పరీక్షిస్తారు. సమస్యని వివరంగా తెలుసుకుని ఆ తరువాత ఫిజిషియన్ వద్దకు పంపుతారు. దీనివల్ల కూడా పెద్ద డాక్టరుకు పేషెంటుతో ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం ఇస్తుంది. పిజిఐ ఛండీగఢ్ నుంచి 80 శాతం డాక్టర్లను, యుఎస్ఎ, యుకెల నుంచి 20 శాతం మందిని తీసుకుంటున్నాం. ఫైవ్‌స్టార్ స్థాయిలో సౌకర్యాలు చెప్తున్నాను కదా అని ఇదేదో డబ్బులున్న వాళ్లకోసం ఏర్పాటయిన ఆసుపత్రి అనుకోవద్దు. మిగతా ఆసుపత్రులతో పోలిస్తే తక్కువ ధరలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తాం మేము.

అన్ని హెల్త్ ప్యాకేజిల్లా కాదు

హెల్త్ చెకప్ ప్యాకేజిల విషయానికి వస్తే పరీక్షలు చేసి జబ్బు ఉన్నదీ లేనిదీ చెప్పి పంపించడం రివాజు. వ్యాధి నివారణ గురించి ప్రస్తావించరు. కాని పేషెంటిని కూర్చోపెట్టి నివారణ గురించి మాట్లాడటమనేది చాలా ముఖ్యం. అందుకే మా హెల్త్ ప్యాకేజి ప్రత్యేకం. మరో ముఖ్య విషయం ఏమిటంటే పేషెంట్ ఆసుపత్రిని 'మెడికల్‌హోం'గా అనుకోవాలి. వాళ్లకి ఎప్పుడు అవసరమయినా డాక్టర్‌కి ఫోన్ చేసి మాట్లాడగలగాలి. అటువంటి అన్ని సౌకర్యాలను మేమందిస్తున్నాం. హాస్పిటల్ ఇండస్ట్రీ ఇప్పుడు బాగా విస్తరిస్తోంది. దూరదృష్టితో ఆలోచించి ఏర్పాట్లు చేయకపోతే అవసరమైప్పుడల్లా గోడలు కూలుస్తూ, కడుతూ ఎక్కువ నిర్మాణ పనులు చేయాల్సి వస్తుంది. అలాంటివి లేకుండా పక్కాప్రణాళికతో 18 అంతస్తుల్లో శరీరంలోని ప్రతి భాగానికి ప్రత్యేక విభాగాలను ఏర్పాటుచేశాం. వైద్య సేవలతో పాటు పరిశోధనకి కూడా మా ఆసుపత్రిలో పెద్ద పీట వేస్తున్నాం.

సహకార శాస్త్రం

వైద్యం అనేది సహకార శాస్త్రం. అంటే పేషెంట్ డాక్టరే కాకుండా, డాక్టర్లు-డాక్టర్లు కూడా మాట్లాడుకుని వైద్యం అందించాలి. 'కాంటినెంటల్'లో మొదటి ప్రాధాన్యత దానికే. ఆ తరువాతే - బిజినెస్. ఆసుపత్రి ఏర్పాటుకి అయిన ఖర్చంతా నా సొంతమే. అనుమతులకోసం చాలానే తిరగాల్సి వచ్చింది. అలాగే ఆటంకాలు కూడా చాలానే ఎదురయ్యాయి. అయినా నిరుత్సాహపడలేదు. లివర్, గ్యాస్ట్రోఎంటరాలజీ నా స్పెషలైజేషన్. ఆసుపత్రి చైర్మన్‌గా నిర్వహణ బాధ్యత చూసుకుంటూ వైద్య వృత్తిని నిర్వహిస్తాను. నిపుణులైన వైద్యులందరూ ఒక గూటి కింద పనిచేయడం అనేది భవిష్యత్తు చిత్రపటం.

డాక్టరవ్వాలనే ఆలోచన...

మూడో తరగతి చదువుతున్నప్పటినుంచే సైన్స్ అంటే చాలా ఇష్టం. అప్పట్లో హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో ఉండేవాళ్లం. మిడిల్ స్కూల్‌కి వచ్చాక నయాపూల్ బ్రిడ్జి మీదుగా రిక్షాలో వెళ్తుండేవాడిని. అప్పుడు తెల్లకోట్లు వేసుకుని వెళ్తున్న డాక్టర్లను చూసి నేనూ డాక్టర్ అయితే బాగుండని మనసులో అనుకునేవాడ్ని. అదీకాకుండా నాకు సైన్స్ అంటే ప్రత్యేక ఆసక్తి ఉండేది. జువాలజిలో జంతుశరీరధర్మశాస్త్రం అంటే ఉన్న ప్రత్యేకమైన ఇష్టం నన్ను డాక్టరు చదివేలా చేసింది. డాక్టర్ చదువులోకి ప్రవేశించకముందే గ్యాస్ట్రోఎంటరాలజి, లివర్‌కు సంబంధించిన విభాగంలో నిష్ణాతుడిని కావాలనుకున్నాను. అదే అయ్యాను.

సాంకేతికతతో జీవితకాలం పెంపు

అమెరికా, చైనాల్లో వందేళ్ల క్రితమే పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఆసుపత్రులు నడపడం మొదలు పెట్టారు. ఆ పరిస్థితి ఇక్కడ ఇప్పుడు కనిపిస్తోంది. దీనివల్ల టెక్నాలజీని ఉపయోగించుకుని మెరుగైన వైద్య సేవలు అందించొచ్చు. దీనికి మంచి ఉదాహరణ భారతీయుల జీవితకాలమే. మన వాళ్ల సగటు జీవితకాలం 66 యేళ్లు. అంటే జపాన్ కంటే పన్నెండేళ్లు, యుఎస్ఎ కంటే పదేళ్ల జీవితకాలం తక్కువన్నమాట. అందుకే ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంలో నూతన సాంకేతిక పద్ధతుల్ని ఉపయోగించుకుని జీవితకాలాన్ని పెంచవచ్చు అంటున్నాను.

ఫోన్ నంబర్: 040-67229999

● కిరణ్మయి

తీహార్ బ్రాండ్

తీహార్ జైలు అనగానే కరడుగట్టిన నేరస్థులే గుర్తుకురావడం సహజం. కానీ అందులోకి అడుగుపెట్టి చూస్తే అదొక చిన్న పారిశ్రామికవాడనే తలపిస్తుంది. ఖైదీలు జైలులోపల కార్మికులుగా మారి సంపద సృష్టిస్తున్నారు. పలు రకాల ఉత్పత్తులను తయారు చేస్తూ.. కోట్లు కురిపిస్తున్నారు. ఈ వ్యాపారం ఏటేటా బాగా వృద్ధి చెందుతూ ఉండడం ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

ఢిల్లీలో బేకరీ ఉత్పత్తులు, ఆఫీస్ ఫైళ్లు, ఫర్నిచర్, షూస్ ఇలాంటివి ఏవి కావాలన్నా షాపుల వద్దకు వెళ్లి 'టీజే' బ్రాండ్ పేరుతో అడిగితే చాలు.. తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులను తీసి ముందు పెడతారు. ఇంతకీ 'టీజే' అంటే ఏమిటనుకున్నారు..? తీహార్ జైల్. ఈ బ్రాండ్ అక్కడ అంత పాపులర్. గత ఆర్థిక సంవత్సరం(2011-12)లో తీహార్ జైలు ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తుల అమ్మకాల విలువ 12.20 కోట్లు. అది ఈ ఆర్థిక సంవత్సరం(2012-13) ముగిసే నాటికి 30 కోట్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. జైలు సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో 700 మంది

ఖైదీలు ఈ వ్యాపార సామ్రాజ్యాన్ని వెలిగిస్తున్నారు. చేనేతలు, చిత్రాలు, సుగంధ పరిమళాలు, పాదరక్షల తయారీ కేంద్రాలను ఇటీవలే కొత్తగా ఏర్పాటు చేశారు. త్వరలో ఆటోమొబైల్ విడి పరికరాల తయారీ తదితర యూనిట్లను కూడా స్థాపించేందుకు జైలు అధికారులు ప్రణాళికలు వేస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పాటు కానున్నాయి. 1961లో తొలిసారిగా తీహార్ జైలులో ఫ్యాక్టరీ ఏర్పాటైంది. అది నేడు ఒక వ్యాపార సామ్రాజ్యంగా మారింది. ఉదయం గడియారం 9 గంటలు కొట్టిన వెంటనే ఖైదీలు ఫ్యాక్టరీ పనుల్లోకి దిగిపోతారు. ఇక్కడి వాటిలో అన్నింటికంటే పెద్దది బేకరీ యూనిట్. ఈ ఉత్పత్తుల అమ్మకాల ద్వారా వచ్చే లాభాలలో 25 శాతం బాధిత కుటుంబాలకు వెళ్లిపోతుంది. మిగతా లాభాలను ఖైదీలకు జీతాలుగా ఇస్తారు. అంటే ఒకవైపు ఖైదీలు సంపాదించుకోవడంతో పాటు.. మరోవైపు వారి చేతుల్లో బాధితులుగా మారిన వారికీ కొంత పరిహారం లభించడం విశేషం. మొన్న హోలీకి అత్యధికంగా అమ్ముడుపోయినది ఇక్కడి ఖైదీలు తయారుచేసిన గులాల్. మొత్తానికి తీవ్రమైన నేరగాళ్లను కూడా పనిమంతులుగా మారుస్తోంది తీహారు జైలు.